

సమాజహితం.. కవిత్వం

కవి కలానికి ఎల్లలు లేవు.. కథాంశానికి పరిధి లేదు. భావవ్యక్తీకరణకు భాష అడ్డుకాదు.. కవి కలం కత్తికన్నా వాడియైనది. నేడు ప్రపంచ కవితా దినోత్సవం నేపథ్యంలో కథనం. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:28	శుక్ర: 4:56

గరిష్టం/కనిష్టం
35.0 /22.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: ఎండల తీవ్రత కారణంగా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పనిచేయని బోర్‌వెల్స్, చేతిపంపులకు మరమ్మతు చేయించాలన్నారు. నీటిసమస్య అధికంగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో గోవింద్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం కాలనీ పరిశీలన



పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

ఖానాపూర్: పట్టణంలోని కొమురంభీం చౌరస్తాలోని డబుల్‌బెడ్‌రూం కాలనీని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం సందర్శించారు. కాలనీలోని సమస్యలపై ఈ నెల 14న 'డబుల్' కాలనీలో సౌకర్యాలేవి? శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించారు. చైర్మన్ చిన్నం సత్యంతో పాటు కాలనీవాసులు ఆయనకు సమస్యలు విన్నవించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా మిషన్ భగీరథ నీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కాలనీలోని సెప్టిక్ ట్యాంక్‌తో పాటు ఇతర సమస్యలను సైతం దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు కావలి సంతోశ్, కిశోర్‌నాయక్, తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,070 ప్రకటించినా బయట మార్కెట్లో ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, గంగారాం, చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.


'అడెల్లి' దుకాణ సముదాయాలకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నిర్మల్: సారంగపూర్ మండలంలోని అడెల్లి ఆలయ పరిసరాల్లో వివిధ వ్యాపారాల నిర్వాహణకుగానూ బుధవారం ఆలయ ఈవో రవికిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఏడాది కాలపరిమితితో ఒడిబియ్యం సేకరణ, అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు సేకరణకు వేలంపాట నిర్వహించగా వ్యాపారులు పోటాపోటీగా వేలంపాడి వ్యాపారాలు దక్కించుకున్నారు. ఒడిబియ్యం సేకరణకు గతేడాది రూ.1,14,000 వేలం పాడగా ఈసారి 2,20,000, చీరల సేకరణకు గతేడాది రూ. 4,74,000 వేలం పాడగా ఈసారి రూ. 4,80,000, ఇతరములకు గతేడాది రూ.69 వేలకు పాడగా ఈసారి రూ.78 వేలకు పాడి వ్యాపారులు దక్కించుకున్నారు. ఏడాది పాటు ఆలయ నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలని ఈవో సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు భూమయ్య, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

ఎవరికి వారే.. కాంగ్రెస్ దారే!



ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీమంత్రి

విఠల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

అప్పాల గణేశ్ చక్రవర్తి, మున్సిపల్ మాజీ చైర్మన్, నిర్మల్

- ఖరారు కాని 'అల్లోల' చేరిక
- వ్యక్తిగతంగా చేరుతున్న నేతలు
- నిర్మల్‌లో ఇద్దరు కౌన్సిలర్ల రాజీనామా
- రేపోమాపో హస్తం గూటికి 'అప్పాల'

ఏం జరుగుతోంది?

రాష్ట్రస్థాయిలో గులాబీపార్టీ ఎలాంటి దుస్థితి ఎదుర్కొంటుందో జిల్లాలోనూ అదేస్థాయిలో ఇక్కట్లు పడుతోంది. మొన్నటికి మొన్న కవిత అరెస్టయితే కనీసం ఒక్కరూ నిరసన వ్యక్తం చేయని పరిస్థితి. మాజీమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, సీనియర్లంతా కాంగ్రెస్‌వైపు చూస్తున్నారు. అయితే.. వీరి చేరికల విషయంలో పక్కాగా ఓ తేదీ అంటూ తేలకపోవడం కొంత క్యాడర్‌ను గందరగోళ పరుస్తోంది. బీఆర్ఎస్ నేతల చేరికలను కాంగ్రెస్ క్యాడర్ వ్యతిరేకిస్తుండటం ఇక్కడ ముఖ్యాంశంగా మారింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులే బడానేతల చేరికలను ఆపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు తమ నేతలతో సంబంధం లేకుండా తమ భవిష్యత్ తమదేనంటూ.. చాలామంది బీఆర్ఎస్ నాయకులు పార్టీ మారుతుండటం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

నిర్మల్: జిల్లాలో రాజకీయం రోజురోజుకూ గందరగోళంగా మారుతోంది. సంబంధిత పార్టీల కార్యకర్తలకే అర్థంకాని తీరులో ఉంది. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కొంతకాలంగా కాంగ్రెస్‌లో చేరుతారంటూ ప్రచారం సాగుతోంది. వారి అనుచరులు సైతం రేపుమాపు అంటూ పలు తేదీలనూ ప్రచారం చేస్తూ వస్తున్నారు. కానీ ఇప్పటికీ ఈ బడా నేతల చేరికపై స్పష్టత రావడం లేదు. వారి అనుచరులు, కొంతమంది నేతలు మాత్రం వారికి సంబంధం లేకుండానే పార్టీ మారుతుండటం చర్చనీయాంశంగా మారింది. తమ నేతలతో సంబంధం లేకుండానే గులాబీ క్యాడర్ కాంగ్రెస్ కండువాలు వేసుకుంటుండటం గమనార్హం.

రాజీనామాలు.. చేరికలు..

బడానేతలతో సంబంధం లేకుండా చోటానేతలు, గల్లీ కౌన్సిలర్లు పార్టీలో నుంచి జంప్ అవుతున్నారు. తాజాగా నిర్మల్ మున్సిపాలిటీలో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేశారు. కౌన్సిలర్లు నల్లూరి పోశెట్టి(వార్డునం.8), తారక వాణి(వార్డు నం.16) బుధవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాన్ని రాసిచ్చారు. ఒకట్రెండు రోజుల్లో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మామడ మండలం పొనకల్‌కు చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ కాలగిరి గంగారెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ నరేశ్‌రెడ్డి, తదితరులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. డీసీసీ అధ్యక్షుడి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. మామడ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత ఏనుగు లింగారెడ్డి సైతం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. రేపోమాపో కాంగ్రెస్‌గూటికి చేరుతామంటున్నారు.

నేతలకంటే ముందే..

అల్లోల, విఠల్‌రెడ్డి చేరికలు ఇంకా ఖరారు కాకముందే 'కారు'పార్టీ ఖాళీ అవుతుండటం చర్చనీయాంశంగా మారింది. దాదాపు పక్షం రోజులుగా వీరిద్దరూ కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచారాన్ని వాళ్లూ ఖండించలేదు. వారి అనుచరులు సైతం కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని చెప్పేస్తున్నారు. మరోవైపు వారు ఎప్పుడు చేరుతారనే దానిపై ఇప్పటికీ క్లారిటీ ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వారి అనుచరులుగా పేరున్న నాయకులు ముందే పార్టీ మారడం స్థానికంగా చర్చించుకుంటున్నారు. అసలు.. అల్లోల, విఠల్‌రెడ్డి వెయిటింగ్ వెనుక కారణాలేంటన్న చర్చ కూడా నడుస్తోంది.

చేరికకు గణేశ్ చక్రవర్తి రెడీ..!

మాజీమంత్రి అల్లోలతో పాటే కాంగ్రెస్‌లో చేరుతారని భావిస్తున్న నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి సైతం ముందస్తుగానే పార్టీ మారడానికి సిద్ధమయ్యారు. ఒకట్రెండు రోజుల్లోనే దాదాపు పదిమంది వరకు మున్సిపల్ కౌన్సిలర్లు, భారీ అనుచరగణంతో పార్టీ మారడానికి సిద్ధమవుతున్నారు. మాజీమంత్రి చేరికపై చర్చ రావడానికి ముందే గణేశ్ చక్రవర్తి కాంగ్రెస్‌తో మంతనాలు జరుపుతూ వస్తున్నారు. ఇదే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డికి దగ్గరున్న నేతల ద్వారా అప్పాల సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అల్లోలతో సంబంధం లేకుండా అతిత్వరలోనే కాంగ్రెస్‌లో చేరడం ఖరారైనట్లు అనుచరులు చెబుతున్నారు.

వేసవిలో ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందు వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య, మున్సిపల్ శాఖల అధికారులతో వేసవి నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ముఖ్యకూడళ్లు, ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాల ముఖ్య కూడళ్లలో ఎండ తీవ్రత నుండి రక్షణ, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. వడదెబ్బకు గురైన వారికి సూచించాల్సిన జాగ్రత్తలపై ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు, హెల్త్ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. పని ప్రదేశాలలో కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రదేశాలు, కార్యాలయాలు, దేవాలయాల వంటి ప్రదేశాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచిత తాగునీటి సౌకర్యం, చలివేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి సమస్యల పరిష్కారం, తక్షణ సహాయం కోసం ప్రజలు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్-6305646600 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా వైద్యశాఖ అధికారి ధన్‌రాజ్, జెడ్పీ సీఈవో గోవింద్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా ఉండాలి

- ఎస్పీ జానకీ షర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్ : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పోలీస్‌స్టేషన్ల వారీగా గతంలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. జిల్లా పరిధిలో అవసరమైన చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీ నిర్వహించాలన్నారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతీ వాహనాన్ని క్షుణ్నంగా పరిశీలించాలన్నారు. దర్యాప్తులో ఉన్న కేసులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. నూతన టెక్నాలజీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. నేరాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రదేశాలను హాట్ స్పాట్‌గా గుర్తించి పాయింట్ బుక్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్, అదనపు ఎస్పీ వీరన్న, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పట్టణ సీఐ అనిల్, రూరల్ సీఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోళ్లు, కేంద్రాల నిర్వాహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఆధ్వర్యంలో 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిర్ణీత తేమ శాతం వచ్చిన తర్వాతే రైతులకు ధాన్యం బస్తాలు పంపిణీ చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పర్టిసిపేషన్ (స్వీప్) ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నందిత, మార్కెటింగ్ ఏడీఎం అశ్వక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'కోడ్' అమలవుతోంది..

- రూ.50వేలకు మించి తీసుకెళ్లొద్దు
- పరిమితి మించితే లెక్కచూపాలి



భైంసా పట్టణంలోని భోకర్ చౌరస్తాలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

నిర్మల్: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతోనే కోడ్ అమలులోకి వచ్చింది. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ జానకీ షర్మిల సైతం ప్రకటించారు. జిల్లాలోనూ ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తున్నారు. కానీ ఇప్పటికీ చాలామంది అవగాహన లోపంతో 'కోడ్'కు చిక్కుతున్నారు. ప్రధానంగా నిబంధనలకు మించి నగదును తీసుకెళ్లడంతో ఇబ్బందుల పాలవుతున్నారు.

రూ.50 వేలకు మించొద్దు..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు రవాణాపైనా ఆంక్షలు ఉంటాయి. రూ.50వేలకు మించకుండా నగదును వెంట తీసుకెళ్లవచ్చు. కానీ..అంతకు మించి తీసుకెళ్లే సమయంలో అందుకు సంబంధించిన అనుమతి పత్రాలు తమవెంట కచ్చితంగా ఉంచుకోవాలి. ఇప్పటికే జిల్లాలో ఏడుచోట్ల పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇదేక్రమంలో ఎన్నికల కోడ్‌పై సరైన అవగాహన లేకపోవడంతో పలువురు పట్టుబడుతున్నారు. తాజాగా భైంసా పట్టణంలో బుధవారం రూ.లక్షా 20 వేలు తీసుకెళ్తూ పట్టుబడ్డారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు మరోసారి కోడ్ విషయంలో ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు.

మరో వారం గడువు



కలెక్టరేట్‌లో బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ భూమిలో డీమార్ట్ నిర్మాణ పనులను చేపట్టడం గురించి బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై కలెక్టర్ విచారణ చేపడుతున్నారని, ఇందుకు మరో వారంరోజులు గడువు కావాలని అడిగారని బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, చందు తెలిపారు. ఈ నెల 20లోపు సమ స్య పరిష్కరించకుంటే తాము ఆందోళన చేస్తామని గతంలో హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం బీజేపీ నాయకులు కలెక్టర్‌ను కలవగా ఇందుకు సంబంధించిన అన్ని శాఖల డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నామని తెలిపారన్నారు.

'ఉపాధి కూలి పెంచాలి'



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కడెం: ఉపాధిహామీ కూలి రూ.600లకు పెంచా లని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షు డు తిరుపతి, కార్యదర్శి నూతన్‌కుమార్ డి మాండ్ చేశారు. బుధవారం మండలంలోని అంబారిపేట్‌లో ఉపాధిహామీ పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల మూడు నెలల కూలి వేంటనే విడుదల చేయాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు.

అడవిపై వేటు.. అనర్థమే..!

- అడవుల రక్షణ అందరి బాధ్యత
- 12శాతం పెరిగిన అటవీ విస్తీర్ణం
- నేడు ప్రపంచ అటవీ దినోత్సవం



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని దట్టమైన అడవులు

జన్నారం: జీవ వైవిధ్యంలో కీలకపాత్ర పోషిస్తున్న అడవులు నేడు అంతరించిపోయే ప్రమాదంలో పడ్డాయి. స్వార్థపరులు చెట్లు నరికి విక్రయిస్తుండడం, కొందరు అటవీ అధికారులు స్మగ్లింగ్‌కు సహకరిస్తుండడం అడవి మైదానంగా మారడానికి కారణం అవుతున్నాయి. పచ్చదనం కనుమరుగై వాతావరణ కాలుష్యం, వ్యాధులు, వైరస్‌లు పుట్టుకొస్తున్నాయి. అడవులు అంతరిస్తే వాతావరణ సమతుల్యత దెబ్బతిని, సూర్యుని నుంచి వెలువడే ప్రమాదకరమైన అతినీల లోహిత కిరణాలు నేరుగా భూమిపై పడి మానవుని మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అడవులు అంతరించిపోకుండా కాపాడుకోవడం అందరి బాధ్యత. నేడు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

అడవుల జిల్లా

రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అడవుల జిల్లాగా పేరుంది. 1965నుంచి దట్టమైన అటవీ ప్రాంతంగా ప్రకటించారు. 1972లో ఈ ప్రాంతానికి వన్యప్రాణి సంరక్షణ చట్టం తీసుకొచ్చారు. 1999లో రక్షిత ప్రదేశంగా ప్రకటించారు. ఇక్కడ అడవి విస్తీర్ణం 2015.44 స్క్వేర్ కిలోమీటర్లు వ్యాపించి ఉంది. దట్టమైన అడవులు, పులుల ఆవాసాలకు అనుగుణంగా ఉండడంతో 2012 ఏప్రిల్ 10న కవ్వాల్ టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం 42వ టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేసి 893 స్క్వేర్ కిలోమీటర్లు కోర్ ఏరియా, 1123 స్క్వేర్ కిలోమీటర్లు బఫర్ ఏరియాగా ప్రకటించింది. టైగర్‌జోన్ దట్టమైన అడవులు, జంతువులు, పక్షులు, సరిస్పాల ఆవాసానికి చిరునామాగా ఉంది. టైగర్‌జోన్ అభివృద్ధికి, అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి.

పెరిగిన అడవుల శాతం

గతంతో పోలిస్తే కవ్వాల్ టైగర్‌జోన్ ప్రాంతంలో అడవుల శాతం పెరిగింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు పోడు వ్యవసాయం, స్మగ్లింగ్‌కు అడవులు నరికివేతకు గురయ్యాయి. దీంతో అడవుల శాతం తగ్గుతూ వచ్చింది. 2016అక్టోబర్‌కు ముందు కవ్వాల్ టైగర్‌జోన్‌లో అడవుల శాతం 21కి పడిపోయింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గత ప్రభుత్వం పచ్చదనాన్ని పెంచడానికి హరితహారం పథకం అమలు చేసింది. టైగర్‌జోన్‌లో అటవీశాఖకు లక్ష్యాన్ని నిర్దేశించడంతో మైదాన ప్రాంతాల్లో, అడవుల్లో మొక్కలు నాటించారు. దీంతో ప్రస్తుతం టైగర్‌జోన్ ప్రాంతంలో అడవుల శాతం 21 నుంచి 33శాతానికి పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

పెరుగుతున్న స్మగ్లింగ్

ఇటీవలి సంఘటనలు పరిశీలిస్తే స్మగ్లింగ్ తిరిగి పుంజుకున్నట్లు తెలుస్తోంది. టైగర్‌జోన్ పరిధిలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్ రేంజ్ పరిధిలో పెద్ద ఎత్తున కలపను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫాబాద్ డివిజన్, జన్నారం, ఖానాపూర్ అటవీ డివిజన్లకు చెందిన ఆరుగురు అధికారులను సస్పెండ్ చేశారు. ఉడుంపూర్ రేంజ్, ఇందన్‌పల్లి రేంజ్ పరిధి నుంచి కలప గుట్టలపైకి తీసుకెళ్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కవ్వాల్ అటవీ సెక్షన్ నుంచి కొందరు ఫర్నిచర్ చేసే వారు నెత్తి మోతలు, ద్విచక్ర వాహనాలు, కార్ల ద్వారా కలప తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

జన్నారం ఆదర్శం

జన్నారం అటవీ డివిజన్ అడవుల రక్షణలో ఆదర్శంగా నిలు స్తోంది. టైగర్‌జోన్‌లో 14శాతం(275 స్క్వేర్ కిలో మీటర్లు) ఉ న్న అడవుల రక్షణ, అభివృద్ధికి కృషి జ రుగుతోంది. నూతన విధానాలతో స్మగ్లింగ్ నిరో ధం, వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడుతున్నా రు. పశువులు, మనుషులు అడవుల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. పశువుల మేత కోసం జ న్నా రం అటవీ డివిజన్‌లో జన్నారం రేంజ్‌లో 4.5 వేల ఎకరా లు, తాళ్లపేట రేంజ్‌లో 2 వేల ఎకరాలు, ఇందన్‌పల్లి రేంజ్‌లో 3.5 వేల ఎకరాలు కేటాయించి పశువులు అందులోనే మేపేలా చర్యలు తీసుకుంటున్నారు.

జీవవైవిధ్యంలో ముఖ్యపాత్ర

మనిషి మనుగడకు దోహదపడే అడవులు జీవవైవిధ్యంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. పక్షులు, జంతువులు, వివిధ రకాల కీటకాలకు ఆవాసాలుగా మారిన అడవులు అంతరించిపోతే అనర్థాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయి. పిచ్చుకలు అంతరించిపోవడం వల్ల మిడుతలు వచ్చినట్లు కరోనా లాంటి కొత్త వైరస్‌లు పుట్టుకొస్తాయి. ప్రాణకోటికి ఆవాసంగా ఉన్న అడవుల రక్షణ అత్యంత అవసరం. అడవులు సమతుల్యత లోపిస్తే వాటిపై ఆధారపడి జీవించే వాటిపై ప్రభావం పడి అనర్థాలకు దారితీసే ప్రమాదం ఉంది.

అడవుల రక్షణ అందరి బాధ్యత



అడవుల రక్షణ అందరి బాధ్యత. మా వంతుగా మేము అడవులను రక్షిస్తున్నాం. విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగంతో కాలుష్యం పెరిగే అవకాశం ఉంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం సూచించిన విధంగా అటవీ సిబ్బంది ద్వారా ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమం చేపట్టాం.

– శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీ అధికారి

అనేక ఉపయోగాలు

అడవుల వల్ల అనేక ఉపయోగాలున్నాయి. స్వచ్ఛమైన వాతావరణం, స్వచ్ఛమైన ప్రాణవాయువు అడవుల వల్ల లభ్యమవుతుంది. పచ్చదనం అడవుల వల్లే సాధ్యం. అడవుల ద్వారా భూమిపై పెరుగుతున్న కాలుష్యం వల్ల అనర్థాలు రాకుండా చూసుకోవచ్చు. అడవుల రక్షణ అందరు బాధ్యతగా తీసుకోవాలి. – శాంతారాం, కన్జర్వేటర్

క్లుప్తంగా

కోర్టులో లొంగిపోయిన పోస్టల్ ఉద్యోగి

ఆదిలాబాద్‌టౌన్: రైతుల డబ్బులను సొంత ఖాతాలోకి మళ్లించుకున్న ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) మేనేజర్ విజయ్ జాదవ్ మంగళవారం కోర్టులో లొంగిపోయాడు. దీంతో ఆదిలాబాద్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆయనను జిల్లా జైలుకు తరలించేలా ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన జిల్లా జైలులో ఉన్నాడు. ఇదిలా ఉండగా వన్‌టౌన్ పోలీసులు జుడీషియల్ కస్టడి కోసం దరఖాస్తు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. 69 మంది రైతులు సీసీఐకి విక్రయించిన పత్తి డబ్బులు రూ.36లక్షలు తన సొంత ఖాతాలో మళ్లించుకున్నాడు. రైతులు జిల్లా అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన ఆ శాఖ ఉన్నతాధికారి విచారణ జరిపి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదైంది. పరారీలో ఉన్న ఆ అధికారి కోర్టులో లొంగిపోయాడు.

బెల్టుషాపుపై పోలీసుల దాడి



పట్టుకున్న మద్యంతో ఎస్సై, సిబ్బంది

బోథ్: మండలంలోని కౌట గ్రామంలో ఓ బెల్టుషాపుల్లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం మేరకు బెల్టుషాపు పై బుధవారం రాత్రి దాడి చేయగా రూ. 41,680 విలువ గల 38,401 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.40వేల మద్యం పట్టివేత

బేల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలోని రెండు చోట్ల బెల్టు షాపుల్లో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు బెల్టు షాపుల్లో రూ.40వేల మద్యం పట్టుకున్నట్లు, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక పేర్కొన్నారు.

రూ.1.20 లక్షల నగదు పట్టివేత

భైంసాటౌన్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.20 లక్షల నగదును పట్టుకున్నట్లు పట్టణ సీఐ డి.రాజారెడ్డి తెలిపారు. పట్టణంలోని భోకర్ చౌరస్తాలో బుధవారం వాహన తనిఖీలు చేపడుతుండగా ముధోల్ గ్రామానికి చెందిన ప్రేమ్ లక్ష్మణ్ వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తనిఖీలో ఎస్సై ఎండీ గౌసుద్దీన్ ఉన్నారు.

సమాజహితం.. కవిత్వం

నిర్మల్‌ఖిల్లా: కవికలానికి ఎల్లలు లేవు.. కథాంశానికి పరిధిలు లేవు.. భావవ్యక్తీకరణకు భాష అడ్డుకాదు.. కవికాలం కత్తికన్నా వాడియైనది. భూతమైనా, వర్తమానమైనా, భవిష్యత్ అయినా.. సున్నిత హాస్యం, వ్యంగ్యం, విమర్శ, ఎత్తిపొడుపు, నీతి, స్ఫూర్తి కీర్తి, మరేదైనా కవి కలంలో అక్షరాలుగా ఒదిగి పోవాల్సిందే.. కవిత్వం ఒక వాక్ కళ. వాక్కు పుట్టినప్పుడే కవిత్వమూ పుట్టి ఉంటుంది. కవిత్వం లేని భాష లేదు.. కవిత్వానికి అందని భావమూ లేదు. కవిత్వాన్ని సంక్షిప్తంగా చవిచూపడానికి ఒక్క పదునైన వాక్యమైనా సరిపోతుంది. మార్చి 21ని ప్రపంచ కవితా దినోత్సవంగా జరుపుకోవడం కవిత్వానికి గల విశ్వ ఆదరణకు నిదర్శనం. నేడు "ప్రపంచ కవితా దినోత్సవం'' నేపథ్యంలో ప్రత్యేక కథనం..



నిర్మల్ జిల్లా కవులు

- అక్షర పరిమళం.. చైతన్య మార్గం
- సాహితీఖిల్లాగా.. నిర్మల్ జిల్లా
- సాహితీవేత్తలకు, కవులకు పుట్టినిల్లు
- కవితలు సమాజ చైతన్య గీతికలు
- విపణిలో పలు కవితాసంపుటిలు, గ్రంథాలు
- నేడు ప్రపంచ కవితా దినోత్సవం...

కవుల జిల్లా...

నిర్మల్ జిల్లా అనగానే కవులు, కళాకారులు గుర్తొస్తారు. జిల్లా చరిత్రలో ఆది నుంచి సాహితీ సౌరభాలు విరబూస్తున్నాయి. జిల్లాలో తొలితరం కవుల నుంచి మొదలుకొని ప్రస్తుతం ఉన్న పద్యకవులు, వచన కవులు, కళాకారులు సాహితీవేత్తల వరకు కొదవలేదు. ఈ వారసత్వాన్ని ఉనికి పుచ్చుకొని వర్తమాన కవులు, కళాకారులు సైతం ఇదే మార్గంలో పయనిస్తున్నారు. కాలం ఏదైనా కవిత్వం యువతను ఆకర్షిస్తూనే ఉంది. కలం తన భావాలను వెదజల్లుతూనే ఉంది. దోపిడీపై ఎలుగెత్తిన విప్లవ కవిత్వం, అంటరానితనంపై మండిపడ్డ దళిత కవిత్వం, స్త్రీ సమానత్వాన్ని కాంక్షించే స్త్రీవాద కవిత్వం, జాతీయ భావాలను ప్రోధిచేసిన జాతీయోద్యమ కవిత్వం, నిరసన గళాన్ని వినిపించిన దిగంబర కవిత్వం ఇలా ఎన్నోరకాల కవిత్వాలు కాలం పొడవునా తన చేవ్రాలు చెక్కుతూనే ఉంటాయి.

తొలితరం నుంచి నేటి వరకు సాహితీతృష్ణలో..

జిల్లాలో ప్రాచీన కవులైన బోయ ధర్మయ్య, మామడ మునిపంతులు, పొన్నకంటి రాజయ్య, నేటి తరాన్ని ప్రభావితం చేసిన మడిపల్లి భద్రయ్య తదితరులున్నారు. ఆధునిక కవులలో ప్రస్తుతం బొందిడి పురుషోత్తం, నేరెళ్ల హన్మంతు, వెంకట్, చక్రధారి, దామెర రాములు, పత్తి శివప్రసాద్, కరిపె రాజ్‌కుమార్, పుండలీక్‌రావు, పోలీస్ భీమేష్, కృష్ణంరాజు, కామారపు జగదీశ్వర్, అబ్బడి రాజేశ్వర్‌రెడ్డి, తొడిశెట్టి పరమేశ్వర్ తదితర కవులు, రచయితలు తమ రచనలతో సామాజిక చైతన్య ప్రతీకలుగా కొనసాగుతున్నారు.



జిల్లాకవులు రచించిన పలు కవితా సంకలనాలు

సామాజిక దర్పణం.. కవిత్వం



సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో కవిత్వం ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. అక్షరాలను ఏరి, పదాలను కూర్చి, సమాజపు స్థితిగతులను వివరిస్తూ, పాలకవర్గాన్ని హెచ్చరిస్తుంది. కవిత్వమే పాటై ఉద్యమిస్తూ, అణగారిన బతుకులకు అండగా నిలుస్తుంది. సమాజ చైతన్యాన్ని ఆకాంక్షిస్తుంది కవిత్వం.

– పోలీస్ భీమేశ్, యువకవి, కళాకారుడు, నిర్మల్

సామాజిక చైతన్యం కోసం..



రోజుకో కవితతో తొలి కోడికూతతో, తొలిపొద్దుతో శుభోదయంతో వాకిల్లు తెరుస్తూ చైతన్య కవిత్వాన్ని పంచుతున్నాను. సాహితీ విపణిలో ఇదోరకమైన సేవగా భావిస్తున్నాను. నిత్యం అక్షరయజ్ఞం చేస్తూ.. హృదయాంతరాళంలో భద్రంగా దాస్తున్నాను. కవులంటే దార్శనికులని, సమస్తాన్ని వీక్షించగల నేర్పరులని తెలియపరుస్తున్నాను.

– అంబటి నారాయణ, కవి, నిర్మల్

కవిత్వం నిత్యజీవన గమనం...



జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు, నిర్మల్ కవిత్వం ఒక కళ, అందుకే అరవై నాలుగు కళల్లో కవిత్వానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడింది. సామూహిక చైతన్యాన్ని కలిగించడంలో కవిత్వం పాత్ర అమోఘం. 'ఒక్క సిర చుక్క లక్ష మెదళ్లకు కదలిక' వాక్కులు అక్షర సత్యాలు. జీవితానికి జీవన అనుభవానికి ఆలంబన కవిత్వమే.

– కారం శంకర్, కవి, రచయిత, 'కవియాత్ర'

కవిత్వంలేని సమాజం ఊహాతీతం...



కవిత్వం లేని సమాజం ఊహించలేం.. సమాజాన్ని చైతన్యవంతం చేయడమే కవిత్వం పని. పల్లెపదాలతో అల్లుకున్న కవిత్వపు పాట ప్రజల నాలుకలపై సజీవంగా నడయాడుతుంది. శ్రమజీవులు తమ కవనంలో మాటలతో, పాటలతో ఆడుతూ పాడుతూ జీవనం సాగిస్తారు. ఆహ్లాద జీవితానికి కవిత్వం దోహదపడుతుంది.

– నేరెళ్ల హన్మంతు, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు, నిర్మల్

కవిత్వం సౌందర్యాత్మక కళాఖండం



కవిత్వం మానవ అనుభూతుల కల్పనతో జనించే ఒక సౌందర్యాత్మక కళాఖండం.. నేనున్నానని నిండుగ పలికే స్వరమే కవిత్వం. కాలం కంట తడి పెట్టినప్పుడల్లా కన్నీరు కవి కలంలోకి పరకాయ ప్రవేశం చేసినప్పుడు వెలువడే వాక్యాలే కవిత్వం.. కవిత్వం సమాజపు ఆస్తి. అంధ విశ్వాసాల్ని నిర్మూలించడంలో తనవంతు పాత్ర పోషిస్తా.

– తొడిశెట్టి పరమేశ్వర్, కవి, రచయిత, నిర్మల్

సామాజిక స్పృహతోనే కవితాచైతన్యం..



జిల్లాలో తొలితరం నుంచి నేటి వరకు సామాజిక అభ్యుదయ భావాలను సంప్రదించే కవితలు సంకలనాలు వెలుబడుతూనే ఉన్నాయి. అక్షరాన్ని ఆయుధంగా మలుచుకొని పీడిత జనం కోసం పాలకులను ప్రశ్నించే గొంతుకలుగా చెప్పవచ్చు. ప్రజానీకంలో చైతన్యం తేవడానికి కవిత్వం కీలక పాత్ర పోషిస్తుంది.

– డా.అప్పాల చక్రధారి, ప్రముఖ కవి, పిల్లల వైద్య నిపుణులు, నిర్మల్

భూ సమస్యను పరిష్కరించండి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతంబాలు



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను తొలగించి భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతం బాలు అన్నారు. బుధవారం తహసీల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం, పేసా వంటి చట్టాలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతూ కొంతమంది ప్రభుత్వ భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లను తొలగించి ఆదివాసీ గిరిజనులకు భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సేడ్మాకీ రామారావు, మండల అధ్యక్షుడు పూసం ఈశ్రు, నాయకులు జైతు, సంతోష్, వీలాష్ తదితరులు ఉన్నారు.

యూఎస్‌ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా నగేశ్



ఆత్రం నగేశ్

ఎదులాపురం: భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్ఐ) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా ఆత్రం నగేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆత్రం నగేశ్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తూ పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా సంవత్సరం ముగియక ముందే కాన్వాసింగ్‌లు నిర్వహించడం, ముందస్తు అడ్మిషన్‌లు జరుపుతున్నారని అన్నారు. ఈ విషయాల్లో విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు మెమోలు

- ఆలస్యంగా హాజరుకావడంపై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని సాయిలింగి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడాన్ని వివరిస్తూ బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రాజర్షి షా స్పందించారు. ఉదయం 8గంటలకు రావాల్సిన ఉపాధ్యాయులు ఆలస్యంగా రావడంపై సీరియస్ అయ్యారు. వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా డీఈవో ప్రణీతను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఈవో నారాయణ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశారు. వారిచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈవో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు.



ప్రజాపాలన సర్వర్ సమస్య...







రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6గ్యారంటీలో సంక్షేమ పథకానికి అర్హులందరూ దరఖాస్తులు చేసుకున్నారు. అయితే కొందరు దరఖాసుల్లో సాంకేతిక సమస్యలు రావడంతో మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం గడువు పెంచడంతో జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. బుధవారం సర్వర్ పనిచేయకపోవడంతో దరఖాస్తుదారులు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు అక్కడే క్యూలైన్‌లో వేచి ఉన్నారు. చేసేదేమీ లేక మధ్యాహ్నం వరకు ఉండి వెనుతిగారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అదనపు కట్నం కేసులో భర్తకు ఏడాది జైలు

ఖానాపూర్: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన పిట్ల రజితకు 2013లో జగిత్యాల జిల్లా మొగిలిపేట్‌కు చెందిన పిట్ల సాయిరాంతో వివాహమైంది. పెళ్లిలో రూ.లక్ష, తులం బంగారంతో పాటు సామగ్రి ఇచ్చారు. వీరి కాపురానికి గుర్తుగా 12ఏళ్ల కుమారుడు, పదేళ్ల కూతురు ఉన్నారు. కొంతకాలంగా రూ.2 లక్షల అదనపు కట్నం కావాలని అత్తింట్లో వేధింపులయ్యాయి. 2014లో భర్త ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లాడు. అప్పటి నుంచి బాధితురాలు తన పిల్లలతో ఖానాపూర్ మండలం తర్లపాడ్‌లోని తల్లి గారింట్లో ఉంటుంది. ఆ తర్వాత 2017లో భర్త స్వదేశానికి రావడంతో రజిత అత్తింటికి వెళ్లింది. భర్త రూ.2లక్షలు అదనపు కట్నం తేవాలని వేధించడం మొదలుపెట్టాడు. ఈ విషయమై పంచాయితీ నిర్వహించినప్పటికీ అతడిలో మార్పు రాలేదు. దీంతో 2017లో ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రజిత ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై చిన్నయ్య కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాడు. ఏపీపీవో రామకృష్ణ 9మంది సాక్షులతో నేరం రుజువు చేయడంతో ఖానాపూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జితిన్‌కుమార్ సాయిరాంకు పై విధంగా శిక్షను విధించినట్లు జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సక్రియానాయక్ తెలిపారు.

అవగాహన సదస్సులో ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు



అవగాహన సదస్సులో ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు

భైంసా: హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన ట్రెస్ మేనేజ్‌మెంట్ ప్రొగ్రాంలో ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు పాల్గొన్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ మూడు రోజులుగా అధ్యాపకులు విద్యార్థులకు కౌన్సెలింగ్ చేయడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించారు. ఎమోషనల్ మేనేజ్‌మెంట్, మెంటల్ హెల్త్, ట్రెస్ మేనేజ్‌మెంట్‌లపై పలువురు వక్తలు అవగాహన కల్పించారు. చదువుకునే విద్యార్థులు మానసిక ఆందోళనలు ఎలా గుర్తించాలో అనే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రంజిత్‌కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఏడు మేకలు మృతి..



మృతిచెందిన మేకల వద్ద బాధిత రైతులు

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్‌లో బుధవారం పిడుగుపడి ఏడు మేకలు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పులిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన 4 మేకలు, తొట్ల సత్తయ్యకు చెందిన 3 మేకలు గ్రామం బయట మేతకు వెళ్లగా వర్షం కురిసే సమయంలో పిడుగుపాటుతో ఏడు మేకలు మృత్యువాత పడ్డాయి. దీంతో సుమారుగా రూ.80 వేల మేర నష్టం వాటిల్లిందని, పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్న ఖుర్షీద్‌నగర్‌కు చెందిన సాబీర్‌ఖాన్‌ను సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. మట్కా నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో బుధవారం దాడి చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రూ.5210 నగదుతో పాటు మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నారు. టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

లారీ బోల్తా



కుప్టి వద్ద బోల్తా పడిన లారీ

నేరడిగొండ: మండలంలోని జాతీయ రహదారిపై కుప్టి గ్రామ వంతెన సమీపంలో ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వస్తున్న లారీ బుధవారం రాత్రి బోల్తా పడిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం... ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వస్తున్న లారీ కుప్టి వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. కాగా వంతెన సమీపంలో రోడ్డుకు అడ్డంగా వాహనం బోల్తా పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలు ఇతర రహదారి నుంచి మళ్లించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని భగత్‌సింగ్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి ప్రయత్నించాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఏటీఎంలోకి ప్రవేశించిన దొంగ ఏటీఎం మిషన్ ముందు భాగాన్ని తొలగించాడు. నగదు ఉండే మిషన్ సైతం ధ్వంసం చేసి నగదు అపహరించుకెళ్లాలని విఫలయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం సైరన్ వినిపించడంతో దొంగ అక్కడి నుంచి పారిపోయాడు. అదే సమయంలో ఏటీఎం సెంటర్ల నిర్వహణను చూసే బ్యాంకు సిబ్బంది అప్రమత్తమై చోరీ యత్నం సమాచారాన్ని పోలీసులకు అందచేశారు. రెబ్బెన పెట్రోకార్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఏటీఎంను పరిశీలించారు. ఏటీఎం సెంటర్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ని పరిశీలించగా దొంగ ఏటీఎం సెంటర్‌లోకి ప్రవేశించడంతో పాటు ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసే సంఘటనలు రికార్డయ్యాయి. కైరిగూడ ఓసీపీ ఓబీ పనుల కోసం కొన్ని రోజుల క్రితం మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వ్యక్తి ఈ చోరీకి యత్నించినట్లు సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయిన వీడియో ఆధారంగా పోలీసులు అనుమానిస్తున్నారు. అనుమానితుడి పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.



సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయిన చోరీ దృశ్యం

ఎస్పీఎం క్వార్టర్‌లో దొంగతనం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని న్యూకాలనీలో ఎస్పీఎం క్వార్టర్ నంబర్.సి 126లో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలతో పాటు బీరువా తాళాలు పగులగొట్టి అందులోని బంగారు ఆభరణాలతో పాటు రూ.10,500 నగదును దోచుకెళ్లారు. బుధవారం తెల్లవారు జామున ఇంటి యజమాని ఈర్ల సునీల్ కుమార్ వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలాన్ని డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జైపూర్: పెద్దపల్లి జిల్లా నుంచి సిరోంచకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జైపూర్ పోలీసులు మంగళవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నారు. రాత్రి పెట్రోలింగ్ తనిఖీల్లో భాగంగా ఇందారం క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించగా బొలెరో వాహనంలో 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రలోని సిరోంచకు తరలిస్తుండగా పట్టుకున్నట్లుగా ఎస్సై శ్రీధర్ తెలిపారు. పట్టుబడిన వాహనాన్ని, బియ్యాన్ని పోలీస్‌స్టేషన్ తరలించినట్లుగా ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై అబీబ్, కానిస్టేబుల్స్ సురేశ్, సుబ్బారావు ఉన్నారు.